

కొమ్మాది రోడ్డులో పిజ్జా హట్ వద్ద దుకాణంలో నవీన్ (ఫైల్)

మధురవాడకు చెందిన నంబూరి నవీన్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. సరైన ఉపాధి లభించకపోవడంతో మాస్టర్ ప్లాన్ రోడ్డు పక్కన పిజ్జా హట్ పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటూ మరో ముగ్గురికి ఉపాధి కల్పించేవారు. నవీన్‌కు భార్య, తండ్రి ఉన్నారు. వారికి ఇదే ప్రధాన ఆధారం. ఇటీవల నవీన్ దుకాణం తొలగించడంతో నాలుగు కుటుంబాలు **ఆధారం కోల్పోయాయి.**

తీరని వేదన

దుకాణాల తొలగింపుతో రోడ్డున పడ్డ చిరు వ్యాపారులు

వారం రోజుల్లో తలకిందులైన పరిస్థితులు • హఠాత్ పరిణామంతో దీనంగా కుటుంబాలు

డైలీ ఫైనాన్స్, ఇతర అప్పుల గురించి ఆందోళన • ప్రత్యామ్నాయం చూపాలని వేడుకోలు

ఫోకస్

ఆపరేషన్ లంగ్స్ తమ బతుకులను రోడ్డు పాల్జేసిందని చిరు వ్యాపారులు కన్నీటి పర్యంతమవుతున్నారు. జీవీఎంసీ అధికారులు వారం రోజులుగా రోడ్డు పక్కన బడ్డీలు, దుకాణాలు తొలగిస్తుండటంతో జోన్-1,2 పరిధిలో వేలకుటుంబాలు రోడ్డున పడ్డాయి. ముందస్తు సమాచారం లేకుండా, సామగ్రి తీసుకునే అవకాశమైనా ఇవ్వకుండా కూల్చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- మధురవాడ

కొమ్మాది స్వయంకృషి నగర్‌కు చెందిన క్రాంతి ఆంధ్రా యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేశాడు. సరైన ఉద్యోగం దొరక్క గాయత్రి ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో కబాబ్ షాపు పెట్టుకుని, మరొకరికి కూడా ఉపాధి కల్పించారు. క్రాంతికి భార్య, ఇద్దరు పిల్లలు. వీరికి **ఇదే బతుకుతెరువు. ఇతని దుకాణాన్ని కూడా** జీవీఎంసీ తొలగించడంతో రెండు కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

ఇలా జీవీఎంసీ జోన్-1, 2 పరిధిలో ఎందరో చిరు వ్యాపారులు జీవనాధారం కోల్పోయారు. తమ బతుకులు సాగేదెలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జోన్-2 పరిధిలోని 9 వార్డుల్లో ప్రభుత్వ అధికారిక సర్వే ప్రకారం 4337మంది వీధిపై, తోపుడు బండ్ల ద్వారా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 2981 మంది ఇదే వృత్తిలో ఉంటున్నట్లు జీవీఎంసీ అధికారులు నిర్ధారించారు. కేంద్రప్రభుత్వం శ్రీవాణి పథకం ద్వారా 398మందికి బ్యాంక్ రుణాలు ఇచ్చింది. ఐడీ కార్డుల కోసం రూ. 200చొప్పున 1600 మందితో డబ్బులు కూడా కట్టించుకున్నారు.


ఆందోళనలో చిరు వ్యాపారులు, తోపుడుబళ్ల యజమానులు


ఉపాధి పరికరాలు తరలిస్తున్న జీవీఎంసీ పొక్లెయిన్

జీవనం.. పెనుభారం

ముందస్తు సమాచారం ఏమీ లేకుండా ఒక్కసారిగా దుకాణాలను తొలగించడంతో ఆ కుటుంబాల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా ఉంది. ఇందులో చాలామంది వ్యాపారం కోసం బ్యాంకులు, డైలీ ఫైనాన్స్ వ్యాపారుల వద్ద రూ.20 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు అప్పులు తీసుకున్నారు. వీరు రోజూ కొంతమొత్తం అప్పు చెల్లించాల్సి ఉంది. ఇప్పుడు కుటుంబపోషణే భారం కాగా.. అప్పు ఎలా తీర్చాలంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

చాలా అన్యాయంగా వ్యవహరిస్తున్నారు



రోడ్డు పక్క వ్యాపారాలు, తోపుడు బళ్ల ద్వారా మా కుటుంబాలను పోషించుకుంటూ మరికొంతమందికి ఉపాధి కల్పిస్తున్నాం. మా దుకాణాలపై దాడి చేసి వేలాది కుటుంబాలను రోడ్డున పడేశారు. ఇది చాలా అన్యాయం.

-డి.ఆదినారాయణ, అధ్యక్షుడు, తోపుడుబళ్లు, చిల్లర వర్తకుల సంఘం

ఆడవాళ్లని కూడా చూడకుండా తోసేస్తున్నారు



20 ఏళ్ల నుంచి కొమ్మాది రోడ్డులో వ్యాపారం చేసుకుంటున్నాం. ఏనాడూ ఇంత అన్యాయం చూడలేదు. ఒక్క రోజు టైం ఇవ్వమంటే ఆడోళ్లని కూడా చూడకుండా తోసేస్తున్నారు. డైలీ ఫైనాన్స్, ఇంటి అద్దె, పిల్లలు ఫీజు, కరెంటు బిల్లు ఎలా కట్టాలి. రోడ్డు మీద నుంచి పొమ్మంటే.. సచ్చిపోవడమే ఉంది.

-లక్ష్మి, చేపల వ్యాపారి, కొమ్మాది రోడ్డు

పండగ ముందు బతుకులు కూల్చేశారు



దసరా పండగ వస్తుందంటే దేశమంతా అందరికీ ఎంతో ఆనందం. కాని మా కుటుంబాల్లో ప్రభుత్వం కన్నీళ్లు నింపింది. దుకాణాలు ధ్వంసం చేయడంతో కనీసం అప్పు కూడా పుట్టడం లేదు. మా కుటుంబం పరిస్థితి ఏమిటి?

- రాంబాబు, చిరు వ్యాపారి, సంఘం కార్యదర్శి, మిథిలాపురి వుడా కాలనీ


తమ దుకాణాలను తామే తొలగించుకుంటున్న వ్యాపారులు


రుషికొండలో క్రేన్ ద్వారా బడ్డీలను తొలగిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

90 మంది విద్యార్థుల రక్తదానం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటీ ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు బుధవారం రక్తదానం చేశారు. స్వచ్ఛతా హీ సేవ – 2025 కార్యక్రమంలో భాగంగా నగరానికి చెందిన లయన్స్ క్లబ్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థుల నుంచి 90 యూనిట్లు రక్తం సేకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్ మాట్లాడుతూ ఒక వ్యక్తి చేసిన రక్తదానం ముగ్గురు ప్రాణాలను కాపాడుతుందన్నారు. విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో కళాశాల సీఎంవో సుబ్బరాజు, ఎన్ఎస్ఎస్ పీవో హరగోపాల్, ఫిజికల్ డైరెక్టర్ ఢిల్లీశ్వరరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.

27న మండల సర్వసభ్య సమావేశం

పద్మనాభం: పద్మనాభం మండల సర్వ సభ్య సమావేశం ఈ నెల 27వ తేదీన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో జయ ఉమ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

ప్రణాళికతో చదివితే విజయం తథ్యం


మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనందరావు

పద్మనాభం: ఉద్యోగార్థులు ప్రణాళిక ప్రకారం చదవాలని, అప్పుడే పోటీ పరీక్షల్లో విజయం సొంతమవుతుందని తహసీల్దార్ కె.ఆనందరావు సూచించారు. పద్మనాభం గ్రామంలో ఉన్న మండల శాఖా గ్రంథాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఉన్న నిరుద్యోగుల నుద్దేశించి ఆనందరావు మాట్లాడారు. సబ్జెక్ట్‌తో పాటు జనరల్ నాలెడ్జ్, కరెంట్ ఎఫైర్స్‌పై దృష్టి సారించాలని సూచించారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను పరిశీలించిన ఆయన ఏ పుస్తకాల ఉన్నాయో లైబ్రేరియన్ అప్పారావును అడిగి తెలుసుకున్నారు.

'ఆర్‌జీఎస్‌ఏ' కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ ప్రారంభం

తగరపువలస: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళిక 2025–26 కార్యక్రమంలో భాగంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశాలపై రెండు రోజుల పాటు జరిగే అవగాహన కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో మూడు మండలాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సీహెచ్ నారాయణమూర్తి, ఆనందపురం ఎంపీడీవో వి.జానకి, డిప్యూటీ ఎంపీడీవో బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలను అందరూ వినియోగించుకోవాలి


వెల్లంకిలో మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రవీంద్ర నాయక్

తగరపువలస: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ప్రతి ఒక్కరూ వైద్య సేవలు వినియోగించుకోవాలని భీమిలి జోన్ మెడికల్ ఆఫీసర్ రవీంద్ర నాయక్ సూచించారు. ఆనందపురం మండలం వెల్లంకిలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో పంచాయతీ పరిధిలోని ప్రజలకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పీవీవీ ప్రసాదరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

- భీమిలి మండలం చిప్పాడలో జరిగిన కార్యక్రమంలో తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యురాలు శోభారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.రాజ్యలక్ష్మి, సర్పంచ్ వెంపాడ రమావతి, ఎంపీటీసీ సభ్యురాలు చుక్క ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

'కూటమి'గా బతుకులను కూల్చేస్తున్నారు

- కన్నీటిపర్యంతమవుతున్న చిరు వ్యాపారులు
- 8వ వార్డులో 20 దుకాణాల తొలగింపు


మధురవాడ శివశక్తినగర్ రోడ్డులో తొలగిస్తున్న బడ్డీ


జేసీబీలతో దుకాణాలు కూల్చేస్తున్న దృశ్యం

కొమ్మాది: కూటమి పాలన తమకు బతుకుల్లో చీకటి నింపిందని చిరువ్యాపారులు కన్నీటి పర్యంతమవుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తమకు చేయూతనిచ్చి ఆర్థిక స్వావలంబన కల్పించగా.. నేటి ప్రభుత్వం తమ పొట్ట కొడుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆపరేషన్ లంగ్స్‌లో భాగంగా క్లీన్‌సిటీ పేరుతో 8వ వార్డులో బడ్డీల తొలగింపు కొనసాగుతోంది. బుధవారం రుషికొండ-ఎండాడ డబుల్ రోడ్డులో బడ్డీలను జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తొలగించారు. సుమారు 20 దుకాణాలను జేసీబీల ద్వారా తరలించి, కొన్ని తొలగించేశారు. మా బ్రతుకులకు ఆధారమేది? ఎలా బతకాలి... అంటూ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మెకానిక్ సెంటర్లు, తోపుడు బళ్లు, కూరగాయలు అంటూ ఏదో ఒకటి అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్న తమపై ప్రభుత్వం కక్ష గట్టినట్లు వ్యవహరిస్తోందని ఆందోళన చెందుతున్నారు.

5వ వార్డులో..

మధురవాడ: జీవీఎంసీ జోన్-2 పరిధిలో టీపీవో శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో హైవే జంక్షన్ మొదలుకుని బడ్డీలు తొలగించారు. 5వ వార్డులోని శివశక్తినగర్ రోడ్డు, పీహెచ్ రోడ్డుతో పాటు జోన్‌లోని ఇతర ప్రాంతాల్లో 60వరకు ఫుట్‌పాత్, రోడ్డు ఆక్రమణలు తొలగించినట్టు ఏసీపీ షబ్నాన్ శాస్త్రి చెప్పారు. ట్రాఫిక్‌కు, ప్రజల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా, నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దుకాణాలు తొలగిస్తున్నట్టు తెలిపారు.

భీమిలి బీచ్‌రోడ్డులో..

భీమునిపట్నం: భీమిలి బీచ్ వద్ద ఫుట్‌పాత్ వైపు ఆక్రమణలను తొలగించేందుకు జోనల్ ఏసీపీ రామకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు బుధవారం వచ్చారు. అయితే, జెడ్పీ అయ్యప్పనాయుడు ఆదేశాల మేరకు రెండురోజుల క్రితమే బడ్డీలు, తోపుడు బళ్ల నిర్వాహకులు వాటిని అక్కడి నుంచి తరలించుకున్నారు. కొన్ని చిన్న బడ్డీలను స్వచ్ఛందంగా వారు తరలించుకున్నారు. దీంతో అధికారులు అక్కడ ఆక్రమణలు లేకపోవడంతో ఫుట్‌పాత్‌పై అడ్డుగా ఉన్న సిమెంట్ దిమ్మలను తొలగించారు. మళ్లీ ఇటువైపు ఎవరూ రావద్దని ఏసీపీ విక్రయదారులకు సూచించారు.


చిన్న బడ్డీని స్వచ్ఛందంగా తీసుకువెళ్తున్న దుకాణదారులు

కోళ్లఫారాలు తొలగించకుంటే ఆందోళన

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు రాయపాలెంలో కోళ్ల ఫారాల కారణంగా 24 గంటలు ఈగలు ముసురుకుని కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. రాయపాలెం గ్రామాన్ని ఆనుకుని భీమిలి మండలానికి చెందిన ప్రముఖ టీడీపీ నాయకుడు కోళ్ల ఫారాలను నిర్వహిస్తున్నట్టు స్థానికులు తెలిపారు. ఈగలు గుంపులుగా బెడ్‌రూమ్, వంటగది, హాలు, టాయిలెట్లలో తిష్ట వేసి చిరాకు కలిగిస్తున్నాయన్నారు. తినే ఆహారం కలుషితం చేయడమే కాకుండా నిద్రాభంగం కలిగిస్తూ వ్యాధులకు కారణమవుతున్నాయన్నారు. కోళ్ల ఫారాలు టీడీపీ నాయకునివి కావడంతో రాయపాలెంలో ఆ పార్టీకి చెందిన వారు నోరు మెదపకుండా మౌనంగా భరిస్తున్నారన్నారు. జీవీఎంసీ అధికారులకు గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. దుర్గంధంతో పాటు విషపురుగులు కూడా సంచరిస్తున్నాయన్నారు. కోళ్ల ఫారాలను తొలగించి ఈగల నుంచి విముక్తి కలిగించకపోతే, భీమిలి జోనల్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగుతామని రాయపాలెం వాసులు స్పష్టం చేస్తున్నారు.

6 మీటర్లను 4 మీటర్లకు కుదించేశారు

రోడ్డు వెడల్పు తగ్గించివేయడంతో స్థానికుల నిరసన

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు సాయి ప్రియ గార్డెన్ ఫేజ్-3లో బీటీ రోడ్డు చాలా సన్నగా నిర్మాణం చేయడంపై స్థానికులు బుధవారం మధ్యాహ్నం నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఇక్కడ 6 మీటర్లు (40 అడుగుల వెడల్పు)గల రోడ్డు ఉంటే దానిపై 4మీటర్లు వెడల్పు గల బీటీ రోడ్డు నిర్మాణం చేస్తున్నారని, వెడల్పు పెంచాలని కోరారు. మిగిలిన రోడ్డు ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు.


సాయిప్రియ లే అవుట్‌లో 4 అడుగుల మేరకే నిర్మిస్తున్న బీటీ రోడ్డు

దీనిపై ఏఈ శ్రీనివాస్‌ని వివరణ కోరగా ఇక్కడ రూ.20లక్షలతో 4 మీటర్లు వెడల్పులోనే పనులు చేయడానికి నిధులు మంజూరు అయ్యాయన్నారు. అవసరమైతే అదనపు నిధులు మంజూరు చేసి వెడల్పు పెంచుతామన్నారు.


శాకంబరిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ


మొగదారమ్మ మహాలక్ష్మి గుడిలో అన్నపూర్ణాదేవిగా..


కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో దుర్గాదేవి


మజ్జివలస రెడ్డివీధి మండపంలో అమ్మవారు


మజ్జివలస ఎస్సీ కాలనీ మండపంలో ..

అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ

శ్రీ దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. సాగర్‌నగర్ మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి, పూజలు చేశారు. ఎండాడ దుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలతో శాకాంబరిగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. భీమిలి కృష్ణాకాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరిన దుర్గాదేవి సన్నిధిలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మజ్జివలసలోని రెడ్డివీధి, ఎస్సీ కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారిని పరిసర ప్రాంతాల భక్తులు దర్శించుకున్నారు. – భీమునిపట్నం/కొమ్మాది/తగరపువలస

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


బ్యాంకులు అందిస్తున్న పథకాల గురించి తెలియజేస్తున్న ఆర్‌బీఐ జీఎం రాజేష్ కుమార్ మహాన

తగరపువలస: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం ఆనందపురం మండలం వేములవలస, బంటుపల్లి కల్లాలు, భీమిలి మండలం తాళ్లవలసలో ఆర్థిక సమీకృత శాచ్యురేషన్ డ్రైవ్‌లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రిజర్వ్‌బ్యాంకు జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ మహాన మాట్లాడుతూ బ్యాంకులు అందిస్తున్న సేవలు, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాల గురించి వివరించారు. ఏపీజీబీ విశాఖ రీజినల్ మేనేజర్ చిరంజీవి బ్యాంకింగ్ సేవల గురించి తెలియచేశారు. బ్యాంకులలో జరుగుతున్న అవినీతి గురించి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ దిలీప్ శుక్లా, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

'మన డబ్బులు - మన లెక్కలు' యాప్‌పై అవగాహన

పద్మనాభం: మన డబ్బులు–మన లెక్కలు (ఎండీఎంఎల్) యాప్‌పై డ్వాక్రా సభ్యులందరూ అవగాహన పెంపొందించుకోవాలని డీఆర్‌డీఏ డీపీఎం వైదేహి కోరారు. పద్మనాభంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సభ్యుల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎండీఎంఎల్ యాప్‌పై అవగాహన ఉన్నప్పుడే, దీనిలో అప్పు కట్టుకుని మోసాల బారిన పడకుండా ఉంటారన్నారు. వచ్చే ఏడాదికి సంబంధించి రూపొందించిన వార్షిక ప్రణాళికను సభ్యులు ఆమోదించారు. ఎండీఎంఎల్ యాప్‌ను అందరూ వినియోగించుకోవాలని ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం బి.వి.రమణ పాల్గొన్నారు.


యాప్‌ను వినియోగించుకోవాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

'కనీస పెన్షన్ రూ.3 వేలకు పెంపునకు అవకాశం'

తగరపువలస: ఈపీఎస్–95 పెన్షన్‌దారులకు భగత్ సింగ్ కోషియార్ కమిటీ సిఫారసుల ఆధారంగా పెన్షన్ రూ.3వేలకు పెంచే అవకాశం ఉందని చిట్టివలస జ్యూట్‌మిల్లు పెన్షనర్ల సంఘం తెలిపింది. చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణమండపంలో బుధవారం నిర్వహించిన పెన్షనర్ల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఈ నెల 19న న్యూఢిల్లీలోని ఈపీఎఫ్‌వో కార్యాలయంలో పెన్షన్ వింగ్ అడిషనల్ పీఎఫ్ కమిషనర్ అపరాధిత జగ్గిని ఏపీఆర్‌పీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.జనార్దనరెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధుల వర్గం కలిసిందన్నారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం పెన్షన్ పెంపును కేంద్ర ప్రభుత్వం ప్రకటించవలసి ఉందన్నారు. అయినప్పటికీ ముందుగా ప్రకటించినట్లుగా కేంద్ర ప్రభుత్వం పెన్షన్ పెంపు ప్రకటన వచ్చేవరకు నవంబరు 11న ఆయా రాష్ట్రాల గవర్నర్లకు వినతిపత్రాలు, 16న విద్రోహదినం డిసెంబరులో ఢిల్లీలో జరిగే ధర్నాకు అంతా సమాయత్తం కావాలని కోరారు. పెన్షనర్ల సంఘం ప్రతినిధులు దామోదర బాబాజీ, మోర అప్పలరాజు, చిల్ల అప్పారావు, పంపాన సూర్యనారాయణ, సింగిడి అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక సేవలో పాల్గొనాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేఖ

భీమునిపట్నం: విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, సామాజిక సేవలు నిర్వ హించాలని ప్రభుత్వ డిగ్రీ కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ సూచించారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సేవలో సంతృప్తి ఉంటుందన్నారు. విద్యార్థులు మంచి పౌరులుగా మారాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి, ఎన్ఎస్.ఎస్ పీవోలు పాల్గొన్నారు.

ఆరు తడితో నీరు ఆదా

పద్మనాభం: ఆరు తడి పద్ధతితో సాగు నీరు ఆదా అవుతుందని ప్రకృతి వ్యవసాయం ఎంఎంటీఎల్ గణేష్ కుమార్ అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మండలంలోని పొట్నూరులో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మట్లాడారు. ఫీల్డ్ ట్యూబ్ పరికరం వరి పైరులో అమర్చడం వల్ల నీరు తక్కువ, ఎక్కువ కాకుండా పంటకు అవసరమైన నీరు అందుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బేపల గురునాయుడు, తోనంగి అప్పలనాయుడు, వీపీఏ షామిలి, ఎన్ఎఫ్ఏ బాలామణి, ఐసీఆర్‌పీలు రమణమ్మ, కుమారి పాల్గొన్నారు.